శ్రీకాంతాచారి త్యాగం చిరస్మరణీయం


జడ్చర్లలో శ్రీకాంతాచారి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు


అడ్డాకులలో శ్రీకాంతాచారి చిత్రపటం వద్ద నివాళి

సాక్షి, నెట్‌వర్క్: తెలంగాణ ఉద్యమకారుడు కాసోజు శ్రీకాంతాచారి ప్రాణత్యాగం చిరస్మరణీయమని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ యాదయ్య పేర్కొన్నారు. మంగళవారం శ్రీకాంతాచారి 15వ వర్ధంతి సందర్భంగా జడ్చర్లలో ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, జ్యోతి, లత, నాయకులు పాల్గొన్నారు.

■ నవాబుపేట మండల కేంద్రంలో శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు బోజయ్యచారి, సుధాకర్, వెంకటయ్యచారిలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. పాండురంగాచారి, శేఖరాచారి, సుధాకర్, బ్రహ్మం, శ్రీనివాస్, రాఘవేందర్, ఆనంద్, వెంకటేష్, శ్రీనివాసచారి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

■ అడ్డాకులలో జేఏసీ మండల కన్వీనర్ ఎం.భీమన్నయాదవ్ ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలో శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి


ల్యాబ్స్ పరికరాలు ఆవిష్కరిస్తున్న డీఈఓ

జడ్చర్ల టౌన్: శ్రీరామ్‌చారిటబుల్ ట్రస్టు, థర్మోకేబుల్ ఫ్యాక్టరీ సంయుక్త ఆధ్వర్యంలో ఇస్తున్న రెండు రోజుల శిక్షణ సద్వినియోగం చేసుకుని విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని గణిత ఉపాధ్యాయులకు డీఈఓ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం జడ్చర్ల జెడ్పీహైస్కూల్‌లో నిర్వహిస్తున్న రెండు రోజుల గణిత ఉపాధ్యాయుల శిక్షణను ఆయన ప్రారంభించారు. ఎంపిక చేసిన పది పాఠశాలలకు ఇస్తున్న మ్యాథమెటిక్స్ ల్యాబ్స్ పరికరాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన గణిత ఉపాధ్యాయులు ఉన్నారని, అయినప్పటికి విద్యార్థుల్లో మ్యాథ్స్ పట్ల ఇప్పటికి కొంత భయం ఉందన్నారు. దాన్ని పోగొట్టేందుకు ఇలాంటి ల్యాబ్స్ పరికరాలు ఉపయోగపడ్తాయన్నారు. ల్యాబ్స్‌ను వినియోగించుకుని గణితంలో విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మ్యాథమెటిక్స్ ల్యాబ్స్ ఏర్పాటుకు ముందుకొచ్చిన శ్రీరామచారిటబుల్ ట్రస్టు, థర్మోకేబుల్ కంపెనీ ప్రతినిధులను అభినందించారు. సీఎంఓ బాలుయాదవ్, ఎంఈఓ మంజులాదేవి, శ్రీరామ చారిటబుల్ ట్రస్టు సీఈఓ నళిని, థర్మోకేబుల్ కంపెనీ ప్రతినిధి సంపత్‌రావు శిక్షణ ఇస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు సుబోజ్, గీత, జడ్చర్ల, రాజాపూర్ మండలాల గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూరగాయల సాగులో మెలకువలు పాటించాలి


బీబీనగర్‌లో మిరప పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న అధికారి ప్రదీప్‌గౌడ్

రాజాపూర్: రైతులు కూరగాయల సాగులో మెలకువలు పాటించి సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడి సాధించ వచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి ప్రదీప్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కల్లేపల్లి, బీబీనగర్ అగ్రహారం పొట్లపల్లి గ్రామాలలో రైతులు సాగు చేసిన మిరప, బెండ కూరగాయల తోటలతో పాటు వేరుశనగ పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు రైతులకు సూచించారు. ప్రస్తుతం చలి ఎక్కువగా ఉన్నందున మొక్కలకు పూత మరియు కాయ రాలకుండా సూక్ష్మపోషకాలైన 19.19.19 ఒక ఎకరానికి యాభైలీటర్ల నీటితో 50 నుంచి 100 గ్రాములు చొప్పున కలిపి పంటపై స్ప్రే చేసుకోవాలన్నారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే రైతులు తేమశాతం 16 వరకు ఉండేలా చూసుకోవాలని ఆయన సూచించారు. ఏఈఓ రమేష్‌రెడ్డి, రైతులు వెంకట్‌రెడ్డి, బుచ్చయ్య, రాములమ్మ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

క్రిస్మస్ సత్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

స్టేషన్ మహబూబ్‌నగర్: క్రిస్మస్ వేడుకల్లో భాగంగా సామాజిక, విద్యా, వైద్య, సాహిత్య, కళా, క్రీడారంగాల్లో ఉత్తమ సేవలు కనబరిచిన వ్యక్తులు, సంస్థలను రాష్ట్ర ప్రభుత్వం సత్కరించనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి శంకరాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదేళ్లుగా ఆయా రంగాల్లో నిష్ణాతులైన వ్యక్తులు, సంస్థలు సన్మానానికి అర్హులని, ఉత్తమ సేవలు చేసిన వారి నుంచి నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్‌లో వ్యక్తిగతంగా లేదా వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకోవాలని, పూర్తి చేసిన వాటిని ఈనెల 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ఐడీఓసీలోని జిల్లా మైనార్టీ సంక్షేమ కార్యాలయంలో అందజేయా లని కోరారు. మిగతా వివరాల కోసం 040-23391067 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు



కోయిల్‌కొండ: కస్తూర్బా ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు నాణ్యతగా భోజనం అందించాలని, లేకుంటే చర్యలు తప్పవని సీఎమ్‌ఓ బాలుయాదవ్ పాఠశాల సిబ్బందిని హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో భోజనాన్ని, పరిసరాలను పరిశీలించారు. ఎప్పటికప్పుడు తాజా ఆకుకూరలతో వండించిన వంటలను మాత్రమే విద్యార్థులకు అందించాలన్నారు. ఆయన వెంట ఎఫ్ఏఓ యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడికి ఆర్థిక సాయం

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల 1999-2000 బ్యాచ్ 10వ తరగతి స్నేహితులు అంకిళ్ల మాజీ ఎంపీటీసీ రఘునాథ్ లివర్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న సందర్భంగా మహబూబ్‌నగర్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు మంగళవారం పరామర్శించి వైద్యఖర్చుల నిమిత్తం రూ.50వేలు అందజేశారు. కార్యక్రమంలో స్నేహితులు రామస్వామి, రాఘవేందర్, వేణుచారి, దిలీప్ శర్మ, రఘువీర్‌యాదవ్, రాఘవేందర్, కృష్ణచారి, రవీందర్‌గౌడ్, శ్రీనువాసులు, కృష్ణయ్య, వెంకటేష్, వీరేందర్ పాల్గొన్నారు.

ఉచిత ప్రవేశం కల్పించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: పిల్లలమర్రిలోని హజ్రత్ సయ్యద్‌షా జమాల్ హుస్సేనీ చిస్తీ, సయ్యద్ కమాల్ హుస్సేనీ చిస్తీ రహెమతుల్లా అలై దర్గా 649వ (పీర్లమర్రి) ఉర్సు ఉత్సవాలు ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు ప్రారంభం కానున్నాయి. ఈనెల 8వ తేదీ ఉర్సు రోజు పర్యాటకులకు ఉచిత ప్రవేశం కల్పించాలని కోరుతూ మంగళవారం కలెక్టర్‌కు జామీయ మజీద్ కమిటీ కార్యదర్శి అబ్దుల్ జకీ, దర్గా కమిటీ అధ్యక్షులు షా మహ్మద్ ఫజల్‌ఖాన్ వినతిపత్రం అందజేశారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధన్‌మోహన్, సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ భవనంలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్ విధానంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దాన్ని రద్దు చేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు దేవరకద్ర మండల పీఆర్టీయూ అధ్యక్ష, కార్యదర్శులుగా రఘువర్ధన్‌రెడ్డి, శ్రీకాంత్, కొౌకుంట్ల మండల ప్రధాన కార్యదర్శి మైనొద్దీన్, హన్వాడ మండల అధ్యక్షుడిగా స్వామిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అశ్వని చంద్రశేఖర్, తమ్మారెడ్డి, అక్తర్ అహ్మద్, పురేందర్‌రెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలు విరమించుకోవాలి

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలను విరమించుకోవాలని మాలల చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మూలె కేశవులు డిమాండ్ చేశారు. మంగళవారం టీఎన్జీఓ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు, కేంద్రంలో అధికారంలో ఉన్న మతోన్మాద బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని రద్దు చేసి మనుస్మృతిని తీసుకురావాలని కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. కేంద్రం ప్రస్తుత దళిత జనాభా దామాషా ప్రకారం 22 శాతానికి పెంచేందుకు కృషి చేయాలన్నారు.

లాల్‌కోట చౌరస్తాలో బస్సులు ఆపాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): దేవరకద్రలోని లాల్‌కోట చౌరస్తాలో ఆర్‌టీసీ బస్సులు ఆపేలా చర్యలు తీసుకోవాలని టీఎఫ్‌టీయూ జిలా అధ్యక్షుడు విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఆర్‌టీసీ డిప్యూటీ ఆర్ఎంకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ బస్టాండ్‌ను ఏర్పాటు చేయాలని, దీంతో అల్లీపూర్, మద్దూర్, సీసీకుంట, ఏదులపూర్, చిన్నవడ్డేమాన్, పెద్ద వడ్డేమాన్, దమగ్నాపూర్, నెల్లికొండి. సీతారాంపేట్, లాల్‌కోట, ఫర్దీపూర్ గ్రామ ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. రాత్రి 10 గంటల అయితే అక్కడ బస్సులు ఆపడం లేదన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి, గట్టన్న, జలాల్‌పాషా, జయపాల్ పాల్గొన్నారు.

నేడు ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమావేశం

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక పారిశ్రామికవాడలోని ఫోరం కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫోరం అధ్యక్షులు ఎ.రాజసింహుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, రావాల్సిన బకాయిలు, కనీస పెన్షన్ పెంపుదలపై తీసుకోవాల్సిన నిరసన కార్యక్రమం తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. సమావేశంలో విశ్రాంత ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

మహిళ అదృశ్యం: కేసు నమోదు


ఇస్లావత్ మన్నీబాయి(ఫైల్)

హన్వాడ: మండలంలోని వెంకటమ్మకుంటతండాకు చెందిన మహిళ అదృశ్యం కావడంతో కేసు నమోదైన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటేష్ వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఇస్లావత్ మన్నీబాయి ఈనెల 1వ తేదీన భర్త వెంకటయ్యతో కలిసి శివారులోని పొలానికి వెళ్లింది. భర్త పొలం పనుల్లో నిమగ్నం కాగా, బయటికి వెళ్లి వస్తానని మన్నీబాయి వెళ్లిపోయింది. అలా వెళ్లిన ఆమె ఇప్పటివరకు ఇంటికి తిరిగి రాలేదు. దీంతో బంధువులు, కుటుంబీకులకు సమాచారం ఇచ్చినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో భర్త వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బూటకపు ఎన్‌కౌంటర్లు ఆపాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఏటూరి నాగారంలో చేసింది బూటకపు ఎన్‌కౌంటరని తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా సమన్వయకర్త బిచ్చారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌కౌంటర్లు జరిగే ప్రతిసారి నక్సలైట్లు మాత్రమే మృతి చెందుతారని, ఈ ఎన్‌కౌంటర్ ముమ్మాటికి దొంగ ఎన్‌కౌంటరని పేర్కొన్నారు.

నియోజకవర్గంలో రూ.82 కోట్లతో అభివృద్ధి

జడ్చర్ల: ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాల్లో భాగంగా 4 నుంచి 8వ తేదీ వరకు నియోజకవర్గంలో రూ.82 కోట్ల వ్యయంతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 4న బాలానగర్, రాజాపూర్, 5న నవాబ్‌పేట, జడ్చర్ల టౌన్, 6న జడ్చర్ల, 7న మిడ్జిల్, 8న ఊర్కొండ మండలాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు తెలిపారు. బాలానగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్ ప్రారంభం, గౌతాపూర్, నందారం, నేరళ్లపల్లి, రంగారెడ్డి గూడ, బోయిన్‌పల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన, గంగాదరపల్లి, నాన్‌చెరువు తండా, శిఖర్‌గానిపల్లి, కేశరావుపల్లిలో గ్రామపంచాయతీ భవనాలనకు శంకుస్థాపన, చిన్నరేవల్లి, చెన్నవెల్లి, కూచూరు, ఆలూరు, చిల్వేరు, గుండ్లగుంటపల్లి అంగన్‌వాడీ భవనాలకు, రాజాపూర్, దొండ్లపల్లి, పెద్దబావితండా, తిరుపమలగిరి, పలుగుతండాలో బీటీ, సీసీరోడ్లకు, జడ్చర్ల పట్టణంలో స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు.

దివ్యాంగులు వృద్ధిలోకి రావాలి


భవిత కేంద్రంలో డీఈఓ, ఎంఈఓలు


అడ్డాకులలో..

అడ్డాకుల/చిన్నచింతకుంట: రాజ్యాంగం కల్పించిన హక్కులను వినియోగించుకుని దివ్యాంగులు వృద్ధిలోకి రావాలని ఎంఈఓ కురుమూర్తి అన్నారు. మండలంలోని ఎమ్మార్సీ కార్యాలయం వద్ద మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. దివ్యాంగులకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎం జ్యోతి, పీఎస్ హెచ్ఎం రాములు, ఫిజియోథెరపిస్ట్ అక్బర్, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు ఆంజనేయులు, శంకర్, ఐఆర్‌పీ శివశంకర్, సీఆర్‌పీ చెన్నయ్య ఉన్నారు.

■ చిన్నచింతకుంట మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం వద్ద అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. దివ్యాంగుల విద్యార్థులకు ఆటపోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, ఎంఈఓ మురళీకృష్ణ హాజరై వికలాంగులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐఈడీలు ప్రసన్నకుమారి, కవిత, సీఆర్‌పీలు ప్రవీణ్, విజయసింహ ఉన్నారు.

జడ్చర్ల భవిత కేంద్రంలో..

జడ్చర్ల టౌన్: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని స్థానిక ఎమ్మార్సీ వద్ద ఉన్న భవిత కేంద్రంలో వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో డీఈఓ ప్రవీణ్‌కుమార్ పాల్గొని దివ్యాంగులకు శుభాకాంక్షలు తెలిపారు. భవిత కేంద్రంలో నిర్వహిస్తున్న కార్యక్రమాల గూర్చి అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగుల పేరెంట్స్‌తో మాట్లాడారు. వారికి స్వీట్లు పంపిణీ చేశారు. అంతకుముందు మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, వార్డు కౌన్సిలర్లు రఘురాంగౌడ్, ఉమాశంకర్‌గౌడ్, జ్యోతి, లత లు భవిత కేంద్రాన్ని సందర్శించి పండ్లు అందజేశా రు. కార్యక్రమంలో ఎంఈఓ మంజులాదేవి, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, సునీత పాల్గొన్నారు.

భగీరథ కాలనీలో పార్కు నిర్మించాలి


మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సంక్షేమ కమిటీ సభ్యులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 22వ వార్డులోని భగీరథ కాలనీలో పార్కు నిర్మాణం చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. తమ కాలనీలో 500కు పైగా ఇళ్లు ఉన్నాయని, ఇంకా 20 శాతం వరకు నల్లా కనెక్షన్లు ఆన్‌లైన్ కాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. వాటికి ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తామంటే మున్సిపల్ సిబ్బంది తీసుకోవడం లేదన్నారు. గతంలో మిషన్ భగీరథ పథకం పైపులైన్ కోసం రోడ్లను అడ్డంగా తవ్వి సరిగా పూడ్చలేదన్నారు. దీంతో ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడి తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ముఖ్యంగా వాహనదారులు, పాదచారులు అవస్థల పాలవుతున్నారన్నారు. ఈ సమస్యలను వీలైనంతవరకు పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో భగీరథ కాలనీ సంక్షేమ కమిటీ అధ్యక్షుడు వై.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎం.జగదీశ్వరాచారి, కోశాధికారి జి.వెంకట్రామరెడ్డి పాల్గొన్నారు.

ముసుగేసిన వరిధాన్యం


నవాబుపేట మార్కెట్‌లో కవర్లతో మూసిన వరి ధాన్యం

నవాబుపేట: తుఫాన్ ప్రభావంతో మేఘాలు కమ్ముకోవడంతో మార్కెట్‌లో ధాన్యం ముసుగేసింది. మార్కెట్‌కు ధాన్యం తీసుకుకొచ్చిన రైతులకు మార్కెట్‌లో టెండర్లు జరగకపోవటంతో ధాన్యాన్ని కవర్లతో మూసి పెట్టారు. నవాబుపేట మార్కెట్‌కు ఆదివారం అమావాస్య అనంతరం తుఫాన్ ప్రభావం, మంగళవారం సెలవు తదితర కారణాలతో వరస సెలవులు రావటంతో రైతులకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో చేసేది లేక రైతులు ధాన్యాన్ని కవర్లతో మూసి ఉంచారు. నవాబుపేట మార్కెట్‌లో దాదాపుగా 10 వేల బస్తాల ధాన్యం నిలువ ఉండటం జరిగింది.

రేపు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

నవాబుపేట: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, పాలక వర్గాల ప్రమాణస్వీకార కార్యక్రమం గురువారం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సమక్షంలో చైర్మన్ లింగం, వైస్ చైర్మన్ తులసీరాంనాయక్‌లతో పాటు పాలకవర్గం సభ్యులు ప్రమాణస్వీకారం చేస్తారని తెలిపారు. మార్కెట్ కార్యాలయం ఆవరణలో జరిగే ప్రమాణస్వీకార కార్యక్రమానికి మండలం నుంచి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.

కారును ఢీ కొట్టిన లారీ: తప్పిన ప్రమాదం

అడ్డాకుల: 44వ నంబర్ జాతీయ రహదారిపై శాఖాపూర్ శివారులో మంగళవారం కారును లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరికి ప్రమాదం తప్పిన సంఘటన చోటుచేసుకుంది. గద్వాల జిల్లా కేంద్రానికి చెందిన నవీన్‌కుమార్ కారులో హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. శాఖాపూర్ టోల్‌ప్లాజా దాటిన తర్వాత కారును హైదరాబాద్ వైపు వెళ్లే లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు దెబ్బతినగా అందులో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాకుండా ప్రమాదం నుంచి బయటపడ్డారు. ప్రమాదానికి కారణమైన లారీని పోలీసులు ఠాణాకు తరలించారు. నవీన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు.

మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పలు ప్రైవేటు పాఠశాలలకు అనుమతి ఇప్పిస్తామని ఓ సంఘం నాయకుడు పలు ప్రైవేటు పాఠశాలల నుంచి డబ్బులు తీసుకుని మోసం చేశాడని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ డీఈఓ ప్రవీణ్‌కుమార్‌కు పలు విద్యార్థి సంఘం నాయకులు ఫిర్యాదు చేశారు. మేరకు ఆ వ్యక్తి నిర్వహించే కోచింగ్ సెంటర్, పాఠశాలకు సైతం అనుమతి లేదని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బంజారా గిరిజన విద్యార్థి సమాఖ్య నాయకులు సంతోష్‌నాయక్, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రశాంత్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్యశిబిరం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా మంగళవారం స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని మున్సిపల్ అతిథి గృహంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 250 మంది పారిశుద్ధ్య కార్మికులకు వివిధ వైద్య పరీక్షలు చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో 18 మంది ఉత్తమ స్వచ్ఛ ఆటో డ్రైవర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్‌చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రవీందర్‌రెడ్డి, గురులింగం, వజ్రకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని సంకల్పసిద్ధి హరిహర అయ్యప్ప క్షేత్రంలో సోమవారం రాత్రి అయ్యప్ప నామస్మరణ మార్మోగింది. అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో మహాపడి పూజ నిర్వహించారు. ఆలయం ముందున్న 18 మెట్ల వద్ద సత్తి గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి విగ్రహానికి అభిషేకం చేశారు. జంగిరెడ్డి కళా బృందం భక్తి పాటలతో అలరించింది. పంచవటి విద్యాలయం కరస్పాండెంట్ తూము అనితారెడ్డి మహాపడి పూజలకు హాజరై స్వామి వారికి అభిషేకం చేశారు. పూజల అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

నారికేళస్వామికి ఘన సన్మానం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం పరిమళగిరిలోని ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామికి పూజలు నిర్వహించారు. 18వ సారి అయ్యప్పమాలధారి నారాయణను ముత్యం గురుస్వామి, పుట్టి సురేష్ చందర్‌స్వామి తదితరులు కొబ్బరి మొక్క అందజేసి పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

ఘనంగా ప్రజాపాలన విజయోత్సవాలు


దేవరకద్రలో కేక్ కట్ చేసి సంబరాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


భూత్పూర్ చౌరస్తాలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


జడ్చర్లలో మున్సిపల్ సిబ్బందికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

సాక్షి, నెట్‌వర్క్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నేటికి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా దేవరకద్రలో కాంగ్రెస్ నాయకులు మంగళవారం కేక్‌కట్ చేసి, బాణాసంచా కాల్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు అంజిల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఫారూఖ్, మార్కెట్ వైస్ చైర్మన్ హన్మంతరెడ్డి పాల్గొన్నారు.

■ భూత్పూర్ చౌరస్తాలో చైర్మన్ బస్వరాజ్ గౌడ్, మేనేజర్ శంకర్ నాయక్, ఆర్టై నర్సింహులు, పారిశుద్ధ్య కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు.

■ జడ్చర్ల పట్టణంలో ర్యాలీ నిర్వహించి మున్సిపల్ సిబ్బందికి ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్, కమిషనర్ ఉన్నారు.

■ అడ్డాకుల మండల కేంద్రంలో బస్టాండ్ ఆవరణలో కేక్‌కట్ చేసి పంచి పెట్టారు. మాజీ ఎంపీటీసీ భీమన్నయాదవ్, సయ్యద్‌షఫీ ఉన్నారు.

ఆరెకటికల హక్కుల కోసం పోరాటం

మహబూబ్‌నగర్ రూరల్: ఆరెకటికల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తామని ఆరెకటిక అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొంపల్లి అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరెకటికల ఆరాధ్య దైవమైన ధర్మవ్యాధుని పూజించేందుకు ప్రభుత్వం స్థలం కేటాయించాలని కోరారు. ద్వాపర యుగంలో ధర్మవ్యాధుడు కౌశిక్కుడు అని వేద బ్రాహ్మణునికి జ్ఞానోదయం కలిగించిన చరిత్ర ఉందన్నారు. అలాంటి మహానుభావుడు ఆరెకటిక కులస్తులు దైవంగా భావించి పూజిస్తారని తెలిపారు. ధర్మవ్యాధిని విగ్రహం ఏర్పాటు కోసం స్థలం కేటాయించాలని కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, ఎమ్మెల్యేలకు విన్నవించామన్నారు. శివాజీ మహారాజ్ ఆరెకటిక కులానికి చెందిన వారేనని, ఆయన కన్నా ముందు లోక కల్యాణం కోసం ఉద్భవించిన యువ పురుషునికి గౌరవం కల్పించాల్సిన బాధ్యత సమాజంలోని అందరిపై ఉందన్నారు. త్వరలోనే ఆరెకటిక ఐక్య గర్జన సభను నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో మాంసపు విక్రయ వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రవీందర్, కోశాధికారి నరేష్, కార్యవర్గ సభ్యులు లక్ష్మీనారాయణ, కృష్ణాజీ, రామచందర్‌జీ, ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.